క్లుప్తంగా

ఘనంగా టైలర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న టైలర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు షబ్బీర్

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలో బుధవారం టైలర్స్ డే దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు షబ్బీర్ మాట్లాడుతూ టైలర్ల సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రెడీమేడ్ దుస్తులు మార్కెట్‌లోకి రావడంతో టైలర్లకు పని లేకుండా పోయిందన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో సెపక్ తక్రా పోటీలు



సౌకర్యాలను పరిశీలిస్తున్న ఆర్‌యూ ప్రొఫెసర్లు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ అంతర్ విశ్వ విద్యాలయల సెపక్ తక్రా పోటీలు జరుగుతాయని రాయలసీమ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎన్‌టీకే. నాయక్, డైరెక్టర్ శివ కిశోర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ మూర్తి తెలిపారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్‌తో కలిసి పోటీలు జరగబోయే వేదికను సౌకర్యాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ మార్చి 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులకు అవసరమైన వసతి సౌకర్యాల కల్పనలో తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు ఏర్రిస్వామి, కంబి రెడ్డి, యుగంధర్ రెడ్డి, హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సబ్బులు, నూనె పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు, నూనె అందజేస్తున్న అధికారులు, నాయకులు

కోసిగి: స్థానిక మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న 42 మంది పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం దుస్తులు, సబ్బులు, నూనెలను అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల నాయకుడు మాణిక్య రాజు,ఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగులో కార్మికుల పాత్ర ఎనలేదన్నారు. రాజేష్, వార్డుమెంబర్ ఈరన్న, శ్రీను, ఉసేని, మధు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మంగమ్మ, మాణిక్యరాజు, కోసిగయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు.

ఆర్థిక సాయం

పెద్దకడుబూరు : తల్లి లేని చిన్నారులకు అండగా ఉంటామని మాజీ ఎంపీపీ రఘురాముడు భరోసా ఇచ్చారు. మండలంలోని గంగుల పాడు గ్రామంలో ఇటీవల భర్త నాగేష్ చేతిలో భార్య జయలక్ష్మి హత్యకు గురైన సంఘటన తెలిసిందే. విషయం తెలుసుకున్న రఘురాముడు బుధవారం గ్రామానికి వెళ్లి తల్లిలేని ముగ్గురు పిల్లలతో మాట్లాడి వారికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటామని చెప్పారు.కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ కార్యకర్త జనార్దన నాయుడుపై జెడ్పీటీసీ రామకృష్ణ సోదరుడు వడ్డె శ్రీనివాసులు మంగళవారం సాయంత్రం దాడి చేసి గాయపరిచాడు. జనార్దన్‌నాయుడు బజారుగుండా వెళ్తుండగా దాడి జరిగింది. వడ్డె శ్రీనివాసులు మంత్రి గుమ్మనూరు జయరాం వర్గీయుడు కాగా, జనార్ధన్‌నాయుడు వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విరూపాక్షి వర్గంలో ఉన్నారు. పార్టీ ఆలూరు ఇన్‌చార్జిగా విరూపాక్షిని నియమించడంపై ఇటీవల జెడ్పీటీసీ రామకృష్ణ పార్టీకి రాజీనామా చేశారు. ఈ క్రమంలో వడ్డె శ్రీనివాసులు ఉద్దేశపూర్వకంగా జనార్దన్‌నాయుడును విరూపాక్షి వర్గం వెంట తిరగవద్దని నానా దుర్భాషలాడుతూ దాడి చేశాడని బాధితుడు వాపోయారు. గాయపడిన జనార్దన్‌నాయుడు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఘటనపై బుధవారం దేవనకొండ సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఐదు దశాబ్దాలకు పరిష్కారం



నాడు...శిథిలమైన బ్రిడ్జి



నేడు... నిర్మాణం పూర్తి

- బాపురం బ్రిడ్జి శిథిలమైనా పట్టించుకోని గత ప్రభుత్వాలు
- పలుమార్లు మట్టితో పూడ్చి సరిపెట్టిన వైనం
- 50 ఏళ్లుగా ఇబ్బందులు పడిన రైతులు, ప్రయాణికులు
- రూ.55లక్షలతో పూర్తి చేయించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- తీరిన ప్రయాణ కష్టాలు



కౌతాళం: గతంలో ప్రజల సమస్యల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించరనడానికి ఈ వంతెన నిదర్శనం. యాభై ఏళ్ల కిత్రం బాపురం బ్రిడ్జి శిథిలమైంది. కనీసం రాకపోకలు సాగించేందుకు కూడా వీలుకాని పరిస్థితి. దాదాపు ఆరు గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాలన్నా, దిగుబడులను ఇంటికి తెచ్చుకోవడానికి పడిన అవస్థలు వర్ణనాతీతం. చాలా సార్లు నాయకులు, అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు మొర పెట్టుకున్నప్పటికీ నాటి పాలకులు స్పందించలేదు. దీంతో వారి కష్టాలు కొనసాగాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక.. రైతులు సమస్యను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి ఆర్ అండ్‌బీ ఉన్నత అధికారులతో మాట్లాడి రూ.55లక్షలు మంజూరు చేయించడంతో గత ఏడాది పనులు ప్రారంభించి పూర్తి చేశారు. బ్రిడ్జి ఎత్తును పెంచడమే కాక మరింత వెడల్పుగా నిర్మించడంతో రైతులు, ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాపురం నుంచి నదిచాగి వరకు రోడ్డు నిర్మాణం ఐదు దశాబ్దల క్రితం చేపట్టినప్పుడు వంకకు బ్రిడ్జి వేశారు. అది శిథిలావస్థకు చేరినప్పుడల్లా దానిపై కొంత గ్రావెల్ వేసి తాత్కాలికంగా ప్రయాణం సాగించే వారు. ఎగువ నుంచి భారీగా వర్షపు నీరు వచ్చినప్పుడు కనీసం వారానికి తగ్గకుండా ప్రయాణాలకు అంతరాయం ఏర్పడేది. పరిష్కరించాలని పలుమార్లు కోరినా ఏ ఒక్కరూ శాశ్వత పరిష్కారం చూపలేదు. ఎట్టకేలకు బ్రిడ్జి ఎత్తు పెంచి, గతంలో కన్నా పొడవు, వెడల్పు పెంచి నిర్మాణం చేపట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులకు రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి.

పేదోడి సొంతింటి కల సాకారం



ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాంపురం గ్రామంలో 52–బసాపురం గ్రామానికి చెందిన 96 మందికి ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం జగనన్న ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వాలు తమ పార్టీ సానుభూతిపరులకు మాత్రమే పథకాలు మంజూరు చేసేవారని గుర్తు చేశారు. ఊళ్లను తలపించేలా జగనన్న కాలనీలు ఏర్పాటు కావడం సంతోషదాయకమన్నారు.పార్టీ మండల అధ్యక్షుడు జి.భీమారెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ



రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ ఈరన్న

కోసిగి: మండలంలోని వివిధ గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి సర్వ హక్కులు కల్పిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ తెలిపారు. బుధవారం స్థానిక సచివాలయం–4 కార్యాలయంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను ఎంపీపీ ఈరన్న అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 2,332 మందికి గాను 2121 మందికి చెందిన రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు వచ్చాయని చెప్పారు. మిగిలినవి త్వరలోనే అందుతాయన్నారు. కోసిగిలో 791 స్థలాలు రిజిస్ట్రేషన్ చేయగా 619 మందికి డాక్యుమెంట్స్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మెంబర్ బుల్లి నరసింహులు, హొలగుంద కోసిగయ్య, వెంకటేష్, వీఆర్వోలు లింగన్న, మయూరి, వీరేష్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



అధికారులకు సూచనలు తెలియజేస్తున్న సబ్‌కలెక్టర్

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ బుధవారం తనిఖీ చేశారు. ఎస్‌కేడీ కాలనీలోని కిడ్స్ స్కూల్, సాయి జూనియర్ కాలేజ్, బార్‌పేటలోని శారదానికేతన్ స్కూల్, ఆర్డీ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న సచివాలయం ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన సౌకర్యాలు రాంప్, తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్ తదితర సదుపాయాలపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. వసతులు పక్కాగా ఉండేటట్లు చూసుకోవాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలోని 17, 18వ వార్డుల పరిధిలోని ఇందిరానగర్‌లోని వెంకటేశ్వర స్వామి గుడి, ఆంజనేయస్వామి గుడి, ఫిలిప్స్ చర్చి లైన్ వీధి, ఎరుకల కాలనీ ప్రాంతాల్లో బుధవారం అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ బోయశాంత, కౌన్సిలర్లు చలపతి, చిన్నా భూమిపూజ చేశారు. ఇన్‌చార్జ్ కమిషనర్ అనుపమ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడారు.గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు, పలు అభివృద్ధి పనులకు పూజా కార్యక్రమాలు చేశారు. 18వ వార్డులో రూ.11.50 లక్షలు, 17వ వార్డులో రూ.5.60 లక్షలతో పనులకు శ్రీకారం చుట్టారు. ఒక్కొక్కవార్డులో రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల మేర వివిధ సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది మందికి లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఎంఈ చలపతిరావు, ఏఈలు రాజశేఖర్, కృపాకర్, సచివాలయం అడ్మిన్ కిషోర్‌కుమార్, వార్డు ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కాశీనాయక్, మమ్మత్తుస్వామి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఛేదిద్దాం.. పోలియోను తరిమికొడదాం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ సత్యవతి

ఆదోనిటౌన్: మార్చి 3 తేదీ నుంచి 5వ తేదీ వరకు జరిగే జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ డా.సత్యవతి పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ.. మార్చి 3వ తేదీ ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. 4, 5వ తేదీన ఇంటింటికి సర్వే చేస్తూ తప్పిపోయిన పిల్లలందరికీ పోలియో ఇమ్యూనైజేషన్ వేస్తారని చెప్పారు. పట్టణంలో 20 వేల మంది పిల్లలు ఉండగా, అందులో 19,160 మందికి పోలియోచుక్కలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 106 పల్స్‌పోలియో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్, మాతాశిశు సంరక్షణ కేంద్రం, ఏరియా ఆస్పత్రుల్లో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 1156 వ్యాక్సిన్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని, 456 మంది సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, డాక్టర్లు వైద్యసిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గిరిజనులను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోనిరూరల్: గిరిజనులను అవమానపరిచిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆదోని పట్టణ పరిధిలోని శ్రీనివాసభవన్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ముందు కేవీపీఎస్, ఆవాజ్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి కేవీపీఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప, ఆవాజ్ కమిటీ పట్టణ జాయిన్ సెక్రటరీ అజీమ్‌ఖాన్, ఎస్సీ, ఎస్టీ ఆర్టీసీ అసోసియేషన్ పట్టణ కార్యదర్శి రవి ప్రసాద్ మాట్లాడుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గిరిజనులు బావిలోని మంచినీరు తాగారని చేతులు కట్టేసి తల్లిదండ్రుల ముందే చితకబాదడం చాలా బాధాకరమన్నారు. చట్టాలను సమర్థవంతంగా చట్టాలను అమలు చేయకుండా పాలకులు, ప్రభుత్వాలు యంత్రాంగం నీరుకారుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మార్కెట్‌యార్డులో హమాలీ దౌర్జన్యం

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో టీడీపీకి చెందిన ఓ కౌన్సిలర్ భర్త, ఓ వార్డు ఇన్‌చార్జ్ అయిన హమాలీ రైతును బెదిరించి వేరుశనగకాయలు బలవంతంగా పెట్టించుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పెద్దకడబూరు మండలం నెమలికల్లు గ్రామానికి చెందిన అంజనయ్య అనే రైతు 40 సంచులు వేరుశనగకాయల దిగుబడులను అమ్మకానికి యార్డులోని ఓ కమీషన్ ఏజెంట్ వద్దకు తీసుకొచ్చాడు. ఏజెంట్ టెండర్‌కు పెట్టాడు. సాయంత్రం యథావిధిగా టెండర్ అనంతరం కాటా పెట్టారు. కాటా వేస్తుండగా మధ్యలో టీడీపీకి చెందిన హమాలీ బలవంతంగా దాదాపు 10 కేజీల వేరుశనగకాయలను తీసుకున్నాడు. రైతు వద్దు అని బతిమలాడినా వినకుండా తీసుకెళ్లాడు. ఆగ్రహానికి గురైన రైతు ఆంజనేయ యార్డు కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశాడు. అధికారులు ఫిర్యాదు లెటర్ రాసి ఇవ్వాలని కోరగా, అంతలోనే హమాలీ వచ్చి.. ఫిర్యాదు చేస్తే నీ సరుకును నిలిపివేస్తామని రైతును బెదిరించాడు. ఇకపై ఏ సరుకైనా యార్డుకు రాకుండా చేస్తానని ఏజెంట్‌ను, రైతును బెదిరించడంతో చేసేదేమిలేక రైతు వెనుదిరిగాడు. ఈ విషయాన్ని యార్డు అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఫిర్యాదు చేయడానికి రైతు వచ్చింది నిజమేనని, లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. అంతలోనే హమాలీ వచ్చి రైతును, ఏజెంట్‌ను సరుకు కాటా వేయకుండా చేస్తామని, యార్డుకు సరుకు రాకుండా నిలిపివేస్తామని బెదిరించాడు. ఏజెంట్ రైతుకు సర్ది చెప్పడంతో ఫిర్యాదు చేయకుండా వెళ్లారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్‌యార్డులో వేరుశనగకాయ దిగుబడులను బలవంతంగా పెట్టించుకున్న హమాలీలపై చర్యలు తీసుకొని ఇలాంటివి జరగకుండా కట్టడి చేయాలని రైతులు, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు కోరుతున్నారు.

చిన్నారుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఆలూరు: అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుతున్న చిన్నారులలో రక్తహీనత, బరువు తగ్గడం వంటి లోపాలు తలెత్తితే అందుకు అంగన్‌వాడీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆలూరు ఐసీడీఎస్ సీడీపీఓ మద్దమ్మ హెచ్చరించారు. ఆమె బుధవారం హాలహర్వి మండలం గూళ్యం, బాపురం, హాలహర్వి అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న పౌష్టికాహారం పంపిణీ తదితర వాటిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు తమ పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారంలో రెండు, మూడుసార్లు చిన్నారుల ఎత్తు బరువు వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పౌష్టికాహారం పంపిణీపై నివేదిక అందజేయాలన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



సి.వి. రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న పురపాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు



నెహ్రుమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శిస్తున్న నమూనాలు



నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాల, నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, అలిమ్ సిద్ధిఖీ తోటి ఉపాధ్యాయులతో కలసి సి.వి.రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుసర్పించారు. మిలన్ గ్రామర్ పాఠశాలలో కరస్పాండెంట్ రమేష్ బాబు అధ్యక్షతన సైన్స్ దినోత్సవం జరుపుకున్నారు. భాష్యం పాఠశాల్లో విద్యార్థులు అవిష్కరించిన వివిధ రకాల మోడల్స్ పలువురిని ఆకట్టుకున్నాయి. కిడ్స్‌కోచ్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అవోపా అధ్యక్షులు వి. శ్రీనాథ్ గుప్తా పాల్గొని విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించారు. ఆయా పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభను చాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

కౌతాళం: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం జ్ఞానేశ్వరి, సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్ ఆయన సేవలను వివరించారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్, ఎలక్ట్రానిక్స్ తదితర ప్రయోగాలు ఆకట్టుకున్నాయి.

పెద్దకడబూరు : మండలంలోని పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కంబలదిన్నె గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నజీర్‌బాషా, ఉపాధ్యాయులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యాస రచన, డ్రాయింగ్, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



కంబలదిన్నెలో సీవీ రామన్ చిత్ర పటానికి నివాళలర్పిస్తున్న ఉపాధ్యాయులు

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

కౌతాళం: ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మొదటి లాంగ్వేజ్ పేపర్ ఉదయం 9 నుంచి 12గంటల వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. విద్యార్థులు 8:30గంటలకు కళశాలకు చేరుకోవాలని సూచించారు. మొదటి సంవత్సరం 154 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా ద్వితీయ సంవత్సరం 200 మంది విద్యార్థులతో పాటు ప్రైవేట్‌గా 175 మంది రాస్తారని వివరించారు.

రైతులకు అండగా ఉంటాం

పెద్దకడబూరు : నియోజకవర్గంలోని రైతులకు అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని హెచ్.మురవణి గ్రామానికి చెందిన రైతు చిన్న హనుమంతు గడ్డివాము గత వారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఆయన ఎమ్మిగనూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో బాధిత రైతుకు రూ.5 వేల నగదు అందజేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

హాలహర్వి: మండలంలోని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ ఆంతోనీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శులు ఈరన్న, శ్రీనివాసులు, నిరంజన్‌లతో సమావేశమయ్యారు. తుంగభద్ర డ్యాం నుంచి విడుదలైన నీటిని పంపింగ్ చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని ప్రజలకు సక్రమంగా తాగునీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్య శ్రీ కార్డుల్ని పంపిణీ చేస్తున్న వలంటీర్లు

కౌతాళం: మండలంలోని అన్ని గ్రామాల్లోని లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్నామని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా బుధవారం తెలిపారు. మండలానికి మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను వలంటీర్ల ద్వార పంపిణీ చేయిస్తున్నామన్నారు. మండలానికి మొత్తం 18,614 కార్డులు వచ్చినట్లు చెప్పారు. కౌతాళంకు 1,379 కార్డులు, బదినేహాల్‌కు 1,077, చూడికి 1,166, హాల్వికి 1,231, ఎరిగేరి గ్రామానికి 1,141, ఉరుకుందకు 1,286, బాపురం గ్రామానికి 832, చిర్తపల్లికు 846, కుంటనహాల్‌కు 780, లింగాలదిన్నెకు 571, నదిచాగికు 838, సుళేకేరికు 785, వల్లూరుకు 547, గుడికంబాలికి 770, తోవికు 488, రౌడూరుకు 553, ఉప్పరహాల్‌కు 660, కాత్రికికు 528, కామవరం గ్రామానికి 252 కార్డులు వచ్చాయని వివరించారు. 23 సచివాలయాలకు మంజూరైన కార్డుల్ని పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయ భవనాలను పూర్తి చేయండి

ఆలూరు: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో నిర్మిస్తున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల పనులను వేగంగా పూర్తి చేయాలని పీఆర్ డీఈ శ్రీరాములు సూచించారు. ఆయన బుధవారం హాలహర్వి, ఆలూరు మండలాల్లోని మనేకుర్తి, ఆలూరు గ్రామాల్లో పూర్తి చేసిన చేసిన సచివాలయ భవనాలను పరిశీలించారు. అనంతరం స్థానిక డీఈ కార్యాలయంలో మాట్లాడుతూ.. దేవనకొండ మండలంలో – 3, ఆస్పరి – 2, ఆలూరు – 2 , హొళగుంద – 5 గ్రామ సచివాలయ భవనాలను త్వరలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. అన్ని మండలాల ఇంజినీర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఈ సూచించారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయండి

హొళగుంద: స్థానిక కోటవీధి 1వ వార్డులో గత మూడు నెలలుగా మంచినీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథా కావడంతో పాటు నీరు కలుషితమవుతున్నాయని స్థానికులు బసవ, సిద్ధప్ప, మల్లయ్య తదితరులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడ్తున్నామని చెప్పారు. లీకేజీ కారణంగా కాలనీలో మంచి ఎద్దడి నెలకొందని, నీరు కలుషితమై పైపులోకి చేరుతున్నాయని వాపోయారు. వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వీధి దీపాల ఏర్పాటు

కోసిగి: మండలంలోని ఐరన్‌గల్లు గ్రామంలో ఎల్‌ఈడీ వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తున్నట్లు సర్పంచ్ రామాంజనేయులు తెలిపారు. బుధవారం గ్రామంలో కాలనీలో పర్యవేక్షించి వీధిలైట్లు పోయిన చోట కొత్తగా ఏర్పాటు చేయించారు.

డాక్యుమెంట్ మిస్సింగ్
అబ్దుల్ రఫీద్ Shaik S/o Shaik అబ్దుల్ రహిమాన్, Survey No. 384, H.No. 1-310-MIG. ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్స్ 20-12-2023న జిరాక్స్ కోసం వెళ్తగా పెద్ద మసీద్ వెనుక రోడ్డులో పడిపోయినవి. పోలీస్ కంప్లైంట్ ఇవ్వడమైనది. MLD012300390762/30.12.23.
సెల్: 94945 08810

ఎస్సీ వర్గీకరణ సాధించేంతవరకూ పోరాడుదాం

ఆదోనిరూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించేంతవరకు పోరాడుదామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బండారి గిడ్డయ్య, హెబ్బటం రాజు పిలుపునిచ్చారు. బుధవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మహాజన సోషలిస్ట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరుగుతున్న విస్తృతస్థాయి సమావేశానికి ఆదోని నియోజకవర్గం నుంచి ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల బాలస్వామి తదితర నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు.

శివస్వాములకు అన్నదానం

కౌతాళం: మండలంలోని ఓబుళాపురం గ్రామంలో శివ మాలధారులకు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీశైలానికి ఇరుముడితో పాదయాత్రగా బయలుదేరుతున్న సందర్భంగా ఓబుళాపురంలో వెలసిన కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మహారుద్రాభిషేకం, మహామంగళ హారతి, ఆకుపూజ, బిల్వాష్టకం, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఓబుళాపురంతో పాటు ఉరుకుంద, చిర్తపల్లి గ్రామాల మాలధారులు కూడా పాల్గొన్నారు. దీక్షదారులు లక్ష్మన్నస్వామి, అయ్యప్ప, నరసింహ,వీరేష్‌స్వామి ఉన్నారు.